క్లుప్తంగా

పథకాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు కృషి

ఉంగుటూరు: మండలం పరిధిలోని సచివాలయాల కన్వీనర్‌గా ఉంగుటూరు ఎంపీటీసీ పెనుగొండ బాలకృష్ణను వైఎస్సార్ సీపీ నియమించింది. ఈ మేరకు ఎమ్మెల్యే వాసుబాబు నుంచి ఉత్తర్వులు అందాయని బాలకృష్ణ తెలిపారు. వలంటీర్లు, సచివాయాల్లో పార్టీ ఇటీవల నియమించిన కన్వీనర్లను సమన్వయపరుస్తూ వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు, ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు, పార్టీ మండల కన్వీనర్ మరడమంగరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాల నిరోధానికి గ్రామ కమిటీలు

ఉంగుటూరు: గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయడం ద్వారా మట్టి అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయనున్నట్లు తహసీల్దారు వెంకటమరమణ తెలిపారు. పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో కలిసి గ్రామస్థాయి అధికారులతో ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. కంసాలిగుంట, గొల్లగూడెం, నల్లమాడు గ్రామాల్లో పోలవరం కుడికాలువ ఇరువైపులా మట్టి కట్టలను తవ్వుతున్నారని ఆరోపణలు రావడంతో చర్యలు చేపట్టామని చెప్పారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలని వినతి

భీమడోలు: మండలంలో పాడైన రహదారులను అభివృద్ధి చేయాలని కోరుతూ మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ షంషూద్దీన్‌కు వినతిపత్రం అందజేసారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు వినతిపత్రాన్ని అందించారు. పూళ్ల – సాయన్నపాలెం, కోరుకల్లు, భీమడోలు గ్యాస్ ఏజెన్సీ రహదారిని అభివృద్ధి చేయాలని మండల బీజేపీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్ తదితరులు కోరారు.జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసశాస్త్రి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

పెదపాడు: రైతులు తమ ధాన్యాన్ని ఈనెలాఖరులోగా మిల్లులకు తరలించాలని పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్‌రాజు, వ్యవసాయ అధికారి వీ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కలెక్టరు ఆదేశాల మేరకు పెదపాడు మండలలోని రైతులు ఈనెలాఖరులో ధాన్యం తరలించాలని, దీనికి అవసరమైన గోనె సంచులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచినట్లు ఆయన చెప్పారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్

కుక్కునూరు : మండలంలోని రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన వివాహితపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను కుక్కునూరు సీఐ కే వీ సత్యనారాయణ సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన ఓబినేని చంద్రశేఖర్ అలియాస్ శేఖర్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన వివాహిత ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో మహిళ నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తగిన ఆధారాలు సేకరించి నిందితుడిని ఆదివారం తన నివాసంలో అరెస్ట్ చేసినట్టు చెప్పారు.

కోడి పుంజుల అపహరణపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: దొరసానిపాడుకు చెందిన లక్కాబత్తుల సిద్ధిరాజు తన పామాయిల్ తోటలో పెంచుతున్న మూడు పందెం కోడి పుంజులను గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 20న రాత్రి దొంగిలించారు. వీటి విలువ రూ. 45 వేలు ఉంటుందని, దొంగిలించిన వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

హోరాహోరీగా క్రీడాపోటీలు

బుట్టాయగూడెం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలవరం నియోజకవర్గస్థాయిలో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న క్రీడోత్సవాలు సోమవారం నాడు కూడా హోరాహోరీగా సాగాయి. వాలీబాల్, కబడ్డీ పోటీలు, విలువిద్య పోటీలు ఎంతో రసవత్తరంగా జరిగాయి. ఎంపీపీ కారం శాంతిరమణ, తహసీల్దార్ ఎస్. శారాకాంతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీహరి, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సర్పంచ్‌లు తెల్లం వెంకాయమ్మ, సరియం లక్ష్మి, తెల్లం వెంకటలక్ష్మి, జీటీఎస్ రాజు, ఎంపీటీసీ తెల్లం రమణ, ఏపీ గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ తెల్లం చిన్నారావు, తదితరులు ఈ ఆటల పోటీలను మూడో రోజు ప్రారంభించి క్రీడాకారులను అభినందించారు. కాగా విలువిద్యలో 125 మంది పోటీపడగా, వాలీబాల్‌లో 64 టీమ్‌లు, కబడ్డీలో 18 టీమ్‌లు పాల్గొన్నాయి. మరో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ ఆటల పోటీల్లో 7 మండలాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

పేదలకు అండగా జగనన్న పాలన



ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు



వసంతవాడలో ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తున్న కొఠారు అబ్బయ్యచౌదరి

గణపవరం: రాష్ట్రంలో ప్రతి పేదకుటుంబానికి అండగా జగనన్న పాలన సాగుతోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం గణపవరం మండలం అప్పనపేటలో నిర్వహించిన 121వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికమని, రాష్ట్ర చరిత్రలో ఇంత పారదర్శకంగా పథకాలు అందించిన దాఖలాలు ఇంతవరకూ లేవన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన పథకాలు ఆయన వివరించారు. పేదల సంక్షేమానికి నవరత్నాల పథకాల ద్వారా ముఖ్యమంత్రి జగన్ ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలనుంచి సమస్యలు తెలుసుకున్నారు. తమకు ఇళ్లస్థలాలు ఇవ్వాలంటూ పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఇప్పటికే అర్హులందరికీ ఇళ్లస్థలాలు ఇచ్చామని, మిగిలిన వారికి మళ్లీ స్థలాలిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్‌క్లినిక్‌ల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. సీఎం జగనన్నకు ప్రజలందరూ అండగా ఉంటే మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మిబాబులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు రాము, ఎంపీటీసీ సభ్యులు కొల్లి సత్యనారాయణ, సర్పంచ్ నక్కా సూరిబంగారయ్య, ఉపసర్పంచ్ నూకారపు సుధాకర్, మాజీ సర్పంచ్ మతల శ్రీనివాస్, మాజీ ఎంపీటిసి సభ్యుడు వర్రే వెంకటసత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు కొలనువాడ శ్రీనివాసరాజు, దండు మురళీకృష్ణంరాజు, పార్టీ నాయకులు సి.వెంకటేశ్వరరావు, రెడ్డి రామకృష్ణ, అంజూరి ఏసు, నక్కా వెంకట్రావు, పాతంశెట్టి శ్రీను, మద్దాల మధు, శ్రీనివాసరెడ్డి, తోటశ్రీను, బుద్దారపు పుల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకొచ్చిన సీఎం జగన్

పెదపాడు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలంలోని వసంతవాడలో ఆయన సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకూ ఎమ్మెల్యే కొఠారు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందుతున్న తీరుపై వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ వారిని సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. వసంతవాడలోని పురాతన పోలీసుస్టేషన్ హౌస్‌ను అభివృద్ధి చేయాలని సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ భావరాజు సత్యనారాయణ కోరారు. దీంతో అభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యావ్యవస్థలో మార్పులో భాగంగా విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు ట్యాబ్‌లు అందించామన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని మంచి నైపుణ్యం సాధించాలన్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సుమారు రూ.1.20 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్టు స్పష్టం చేసారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతల రమాభారతి, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, నాయకులు సంబంగి శ్రావణ్‌కుమార్, పెదపాడు సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ అక్కినేని రాజశేఖర్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపీ చంద్ర దుర్గాప్రసాద్, ఎంపీటీసీ కలపాల ఆదిలక్ష్మి, ఉపసర్పంచ్ ఫణి కుమార్, నాయకులు తుమ్మల గోపాలకృష్ణ, తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, మట్టా లక్ష్మణరావు, అయూబ్‌ఖాన్, విజయరాజు పాల్గొన్నారు.

నేడు అప్పనపేటలో గడపగడపకు

గణపవరం: గణపవరం మండలం అప్పనపేటలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దండు రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలు తెలుసుకుంటారని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈకార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

చిత్తశుద్ధితో సేవలందించాలి

దెందులూరు: జగనన్న సచివాలయ కన్వీనర్లు వైఎస్సార్‌సీపీ మూలస్తంభాలని పార్టీకి, కార్యకర్తలకు సమన్వయకర్తలుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. సోమవారం పోతునూరులో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన జగనన్న సచివాలయ మండల కన్వీనర్ల నియామకం పార్టీ బలోపేతం తీసుకువచ్చే చర్యలపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కామిరెడ్డి నాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆశయాలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో సేవలందించాలన్నారు. సర్పంచ్ బోదుల స్వరూప్, ఎంపీటీసీ సున్నా నరేష్, జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సచివాలయ కన్వీనర్ కట్టా ఏసుబాబు, జిల్లా కార్యదర్శి చల్లా మేరీరాజు, వ్యవసాయమండలి సభ్యులు బత్రాజు సత్యనారాయణ, మండల బూత్ మేనేజర్ తలారి రామకృష్ణ.గ్రామ సచివాలయ కన్వీనర్లు, పోతునూరు, కేదవరం, లక్ష్మీపురం, ఉండ్రాజవరం గ్రామాల పార్టీ నాయకులు హాజరయ్యారు.

పాడి రైతులకు అండగా కిసాన్ మిల్క్ యూనిట్



జానంపేటలో కిసాన్ మిల్క్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న కొఠారు రామచంద్రరావు, ఎమ్మెల్యే అబ్బయ్య

పెదవేగి : జానంపేట చుట్టుపక్కల గ్రామాల పాడిరైతులకు అండగా ఉండేందుకు కిసాన్ మిల్క్ యూనిట్ ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. దీన్ని ఆధారంగా చేసుకుని పాడి పరిశ్రమ కూడా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. పెదవేగి మండలం జానంపేటలో సోమవారం కిసాన్ మిల్క్ యూనిట్‌ను ఎమ్మెలే కొఠారు అబ్బయ్యచౌదరి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఏపీ ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జానంపేట చుట్టు పక్కల గ్రామాల పాడి రైతులకు, ఈ మిల్క్ యూనిట్ వల్ల ఎంతగానో ఉపయోగం ఉంటుందని చక్కటి ధరతో పాలను కొనుగోలు చేసి నాణ్యమైన పాల ఉత్పత్తులను అందించేందుకు దోహదపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా మిల్క్ యూనిట్ అధినేత బొద్దు సతీష్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జానంపేట బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, విజయరాయి సొసైటీ అధ్యక్షుడు పాలడుగు పెద బాబు, మండల కన్వీనర్ కేశన సతీష్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ మెట్లపల్లి సూరిబాబు, లేగల శివ, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డ్‌కు గ్రేడింగ్ మిషన్

పెదవేగి : నిమ్మ వర్తకులకు గ్రేడింగ్ ప్రక్రియ సులభతరమయ్యేలా నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ అధునాతన విలువైన పరికరాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని దెందులూరు వ్యవసాయ మార్కెట్‌లో ఈనెల 25న బుధవారం ఉదయం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి నిమ్మ లోడింగ్, గ్రేడింగ్, క్లీనింగ్ యంత్రాలను ప్రారంభించనున్నారు. సోమవారం యార్డ్ నిర్వాహకులు ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి, యార్డ్‌కు ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యేమార్కెట్ యార్డ్ సెక్రటరీ మాట్లాడుతూ సుమారు రూ.18 లక్షలు విలువ గల లోడింగ్ యంత్రం నిమ్మ వర్తకులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గంటకు 4 టన్నులు నిమ్మకాలయను సైజుల వారీగా గ్రేడింగ్ చేస్తూ, వర్తకులకు సమయం వృథా కాకుండా, హమాలీలకు పని సులువుగా ఉంటుందని చెప్పారు. వచ్చే నిమ్మ సీజను ఫిబ్రవరి నుంచి మే నెల వరకు రైతులకు పని భారం తగ్గించేందుకు ఈ యంత్రం ఉపయోగపడుతుందని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పదేళ్లు పొడిగింపుపై హర్షం



ఎమ్మెల్యే కార్యాలయంలో మాట్లాడుతున్న పళ్ళెం ప్రసాద్, జడ్పీటీసీ, ఎంపీపీ, తదితరులు

దెందులూరు: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ (ఉపప్రణాళిక)ను మరో పదేళ్లు పొడిగించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్ అన్నారు. సోమవారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఏలూరు మండల అధ్యక్షుడు తేరా ఆనంద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పళ్ళెం ప్రసాద్, దెందులూరు జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, పెదపాడు ఎంపీపీ బత్తిన రత్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ దళిత గిరిజనుల హక్కుల పరిరక్షణ, వారి జీవన విధానం మెరుగుపర్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. సబ్‌ప్లాన్ చట్టాన్ని పదేళ్లు పెంచి దళిత గిరిజన గుండెల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. తామంతా సీఎంకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి జీవితాంతం కృతజ్ఞతగా ఉంటామన్నారు. ఇస్రాయేలు, పళ్ళెం శ్యాంతంబి, గొల్ల కిరణ్ తదితరులున్నారు.

దళితులు, గిరిజనులకు మేలు

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను మరో పదేళ్ల పొడిగిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయడంపై భీమడోలు సర్పంచ్, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతా మాన్‌సింగ్ హర్షం వ్యక్తం చేసారు. భీమడోలులో సోమవారం ఆమె మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ గడువు ఈనెలాఖరుకు ముగిస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం ఉపప్రణాళికను పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఇది దళితులు, గిరిజనులకు మేలు చేస్తుందన్నారు.

పొడిగింపు చాలా సంతోషం

భీమడోలు: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను ప్రభుత్వం మరో పదేళ్ల పాటు పొడిగించడం చాలా సంతోషమని భీమడోలు ఎంపీపీ కనుమాల రామయ్య సోమవారం అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దళిత, గిరిజన సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నారని అన్నారు. మండల కేవీపీఎస్ అధ్యక్షుడు టి.సుమన్‌బాబు ఉప ప్రణాళిక గడువును పొడిగించడంపై హర్షం వ్యక్తం చేసారు.

నేతాజీ పోరాటం యువతకు స్ఫూర్తి



నేతాజీ చిత్రపటానికి పూలమాలవేస్తున్న ఉపాధ్యాయిలు, విద్యార్థులు

గణపవరం: స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీది ప్రత్యేక స్థానమని ఆయన పోరాట పటిమతో బ్రిటిష్ సామ్రాజ్యం గడగడలాడిందని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మల కుమారి, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.రాంబాబు అన్నారు. సోమవారం నేతాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు, పర్యావరణ మిత్ర అల్లూరి రంగరాజు, డిగ్రీకాలేజి వైస్ ప్రిన్సిపల్ మధురాజు, అధ్యాపకులు స్వరూపారాణి, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ సేవలు ఆదర్శనీయం

భీమడోలు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు దేశానికి ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు పెరుమాళ్ల స్థంభం యూత్ ఆధ్వర్యంలో, మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ సంద్రబోస్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. భీమడోలు పెరుమాళ్ల స్థంభం యూత్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, సొసైటీ డైరెక్టర్ కిలపర్తి భాస్కరరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నాయకులు మంచెం నాగు, షేక్ హిదయతుల్లా పాల్గొన్నారు. భీమడోలు బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్ ఆధ్వర్యంలో బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు మత్తి శ్రీనివాసశాస్త్రి, నాయకులు సాయి దీపిక, పీవీ రాఘవులు, సికిందర్ చౌదరి, సురేష్ ప్రసాద్, రామచంద్రరావు పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి

దెందులూరు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు అందరికీ ఆదర్శనీయమని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎస్ఎస్ఎల్‌వీజీ శర్మ అన్నారు. సోమవారం పాఠశాలలో నేతాజీ జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులు నాగరాజు, భగవతీదేవి పాల్గొన్నారు. గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఝాన్సీ, ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జంగారెడ్డిగూడెంలో వృద్ధుని కథ సుఖాంతం

- మతిస్థిమితం లేక ఐదేళ్ల క్రితం కాకినాడ నుంచి వచ్చేసిన రామారావు
- ఇన్నాళ్లకు గుర్తుపట్టి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు



వృద్ధుడు రామారావును తీసుకెళుతున్న అన్న కుమారుడు రాజ్‌కుమార్, తహసీల్దార్ స్లీవజోజి

జంగారెడ్డిగూడెం : మతి స్థిమితం లేక అనాథగా రోడ్లపై జీవిస్తున్న ఓ వృద్ధుడి కథ సుఖాంతమైంది. చాలా కాలంగా కనిపించకుండా పోయిన ఆ వృద్ధుడిని కుటుంబ సభ్యులు గుర్తుపట్టి తమతో పాటు తీసుకువెళ్లారు. వివరాల్లోకి వెళ్తే వృద్ధుడు కోరుకొండ రామారావు మతి స్థిమితం కోల్పోయి ఐదేళ్ల క్రితం సొంత ఊరు కాకినాడ నుంచి వచ్చేశాడు. కొంతకాలంగా జంగారెడ్డిగూడెం రోడ్లపై జీవిస్తూ కాలం గడుపుతున్నాడు. అయితే ఇటీవల మున్సిపల్ అధికారులు చెత్త వాహనంలో వృద్ధుడిని తరలిస్తుండగా స్థానికులు అడ్డుకుని పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి పోలీసుల సహాయంతో అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఈవిషయం పత్రికలతోపాటు సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో రామారావు కుటుంబ సభ్యులు అతడిని గుర్తుపట్టారు. కాకినాడలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కోరుకొండ రామారావు అన్న కుమారుడు కె.రాజ్‌కుమార్ విషయం తన బాబాయ్‌ను గుర్తుపట్టాడు. సోమవారం జంగారెడ్డిగూడెం వచ్చి ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న తన బాబాయ్‌ని చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాల నుంచి తన బాబాయ్ కనిపించడం లేదని, ఎన్నిచోట్ల వెతికినా ఆచూకీ లక్ష్యం కాలేదని, కరోనాతో చనిపోయి ఉంటాడని భావించామని, రెండు రోజులుగా టీవీల్లో, పేపర్లలో వచ్చిన వార్తలను చూసి సంతోషించి ఇక్కడకు వచ్చామని రాజ్‌కుమార్ తెలిపారు. తన బాబాయ్ ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ చూపిన జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు రాజ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కె.స్లీవజోజి సమక్షంలో వృద్ధుడు రామారావును అంబులెన్స్‌లో కాకినాడకు తీసుకువెళ్లారు.

పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలి



పూళ్లలో మద్దుల రాజాకు నియామక పత్రాలు అందిస్తున్న నాయకులు

భీమడోలు: ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా సచివాలయాల కన్వీనర్లు కృషి చేయాలని పుప్పాల కార్తీక్ అన్నారు. పూళ్లలో సోమవారం సచివాలయాల మండల కన్వీనర్‌గా నియమితులైన భీమడోలుకు చెందిన మద్దుల రాజాకు మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్‌తో కలిసి పుప్పాల కార్తీక్ నియమాక పత్రాలను అందించారు. మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లను నియమించినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా పని చేస్తామన్నారు. మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, నాయకులు పసుపులేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోపీనాథపట్నంలో గ్రామసభ

ఉంగుటూరు(గణపవరం): ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈసభకు సర్పంచ్ పుచ్చకాయల విష్ణుమూర్తి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా మండల అధ్యక్షురాలు గంటా శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ఉపాధిహామీ పనులు, పింఛన్లు, రెండేళ్లుగా నిర్వహించిన ఖర్చులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఎంపీడీవో ప్రేమాన్విత, మార్కెట్ కమిటీ డైరక్టర్ గంటా లక్ష్మణరావు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

కుకునూరు : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన బంజరగూడెంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బంజరగూడెంకి చెందిన ముత్తినేని మునీశ్వరి కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లగా సోమవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి పొగలు వ్యాపించాయి. ఇంట్లో ఉన్న గ్యాస్ బండకు మంటలు వ్యాపించి పేలిపోవడంతో ఇల్లు మొత్తం పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామాన్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ. 50 వేలు నగదు, రూ.లక్ష విలువ చేసే బంగారం దగ్ధమయ్యాయి.

ఆయిల్ పామ్ పరిశోధనా కేంద్రం డైరెక్టర్‌గా కంచర్ల సురేష్




డాక్టర్ కంచర్ల సురేష్

పెదవేగి : ఏలూరు జిల్లా పెదవేగిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ డైరెక్టర్‌గా డాక్టర్ కంచర్ల సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదవేగి ఆయిల్ పామ్ పరిశోధనా కేంద్రం పేరు ప్రతిష్ఠతలు మరింత ఇనుమడింప చేసే విధంగా అధికారులు, సిబ్బంది శ్రద్ధతో పనిచేయాలన్నారు. ఇంతకు ముందు డాక్టర్ కంచర్ల సురేష్ ఐసీఏఆర్, ప్రిన్సిపల్ సైంటిస్ట్, సైంటిస్ట్ ఇన్‌చార్జి, ప్రాజెక్ట్ మానిటరింగ్, ఎవాల్యుయేషన్ సెల్‌లో సేవలందించారు. ఈయన 60కి పైగా పరిశోధనా వ్యాసాలను ప్రచురించి ప్రపంచ ఖ్యాతి పొందిన శాస్త్రవేత్తగా గుర్తింపు పొందారు. దేశంలో ఆయిల్ పామ్ పరిశోధన, అభివృద్ధిలో ఆయనకు 26 ఏళ్లకుపైగా అనుభవం ఉంది.

ఇంటి యజమానిపై భార్యాభర్తల దాడి

ద్వారకాతిరుమల : ఇంటి యజమానిపై దాడి చేసిన భార్యాభర్తలపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం. మండలంలోని తిమ్మాపురానికి చెందిన వాసిరెడ్డి సోమశేఖర్ తన ఇంటి పక్కనే ఉన్న మరో ఇంటిని బంధువులైన పర్వతనేని హరివెంకట యుగంధర్ బలరామరెడ్డి, గీత దంపతులకు 15 ఏళ్ల క్రితం అద్దెకిచ్చాడు. రెండేళ్లుగా వారు సోమశేఖర్‌కు అద్దె చెల్లించడం లేదు. ప్రస్తుతం ఇంటి గొడవకు సంబంధించి కోర్టులో విచారణ జరుగుతోంది. ఇదిలా ఉంటే ఈనెల 21వ తేదీ సాయంత్రం బలరామరెడ్డి ఇంటి గేటుకు వెల్డింగ్ చేయించడం, గోడ కట్టడం వంటి పనులు చేయిస్తున్నాడు. ఆ సమయంలో సోమశేఖర్ వాటిని వీడియో తీస్తుండగా బలరామరెడ్డి, అతని భార్య గీత సోమశేఖర్‌పై గొడవకుదిగి అతడ్ని తిట్టి, కొట్టి, చంపడానికి ప్రయత్నించారు. బాధితుడు కవుకు దెబ్బలతో ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేరి, చికిత్స పొందాడు. దీనిపై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

తుపాకులగూడెం చిత్రం యూనిట్ సందడి



సోమవరప్పాడులో మాట్లాడుతున్న తుపాకులగూడెం చిత్రం యూనిట్

దెందులూరు: తుపాకులగూడెం సినిమాను ఫిబ్రవరి 1న 200 థియేటర్లల్లో విడుదల చేస్తున్నామని సినీ హీరోలు ప్రవీణ్ కండేలా, శ్రీకాంత్ రాథోడ్ అన్నారు. సోమవారం సోమవరప్పాడు పంచాయతీ పరిధిలో 16వ జాతీయ రహదారి పక్కన దామిక్స్ కేఫ్‌లో వారధి క్రియేషన్స్ ఆధ్వర్యంలో తుపాకులగూడెం సినిమా యూనిట్ విలేకరుల సమావేశం నిర్వహించారు. డైరెక్టర్ జయదీప్ విష్ణు, కోడైరెక్టర్ సంతోష్, హీరోయిన్ జయంత్రి, విలన్ శివరామ్‌తో కలిసి చిత్రం యూనిట్ వివరాలు వెల్లడించారు. యాక్షన్, ఫ్యామిలీ డ్రామా, కామెడీ తరహా నేపథ్యంతో సినిమా ఎంతో అద్భుతంగా వచ్చిందన్నారు. ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం అందించారన్నారు. ప్రతి ఒక్కరూ తమ సినిమాను చూసి తమను దీవించాలని కోరారు.

అచ్చమ్మతల్లికి వెండి కుందుల సమర్పణ

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయానికి సోమవారం కూచింపూడి గ్రామానికి చెందిన దాతలు పామర్తి ధనుంజయ, రాంబాబు వెండి దీపారాధన కుందులను అందించారు. వెండి కుందులను ఆలయంలో కమిటీ సభ్యులకు దాతలు అందజేశారు.